



# గుండె లోతు

సాహితి (ఎస్. శ్రీదేవి)

ప్రేమంటే ఏమిటో తెలియకుండానే జీవితపు చరమాంకంలోకి చేరుకునే వారెందరో. ఆపైన సంధ్య వాలుతుంది. మృత్యువు కబళిస్తుంది. వికసించని మనసు మొగ్గగానే రాలిపోతుంది. ఈ వాస్తవం తెలీక ఎందరో ఆడామగా కలిసి మాట్లాడుకోగానే అదే ప్రేమనేసుకుని ఎంతో దూరం వూహించుకుంటారు.

దీనికి నేను మినహాయింపు కాదు. కాబట్టే ఎముకలు కొరికే చలిలో ఈ ప్రయాణం.

మనిషి ఏదేనా తెలివైన పని చెయ్యటానికి ప్రత్యేకించి ఏ కారణమూ వుండదు. అదే ఒక పిచ్చిపని చెయ్యటానికి ఒక చిన్న అనుమానమో, సరదానో కారణమౌతుంది.

నా విషయంలోనూ అంతే జరిగింది.

సరిగ్గా ఇరవైనాలుగు గంటల క్రితం.

*

శ్రీమతి వాసంతిగారికి,

నా పేరు భాస్కర్, సామంత్ బిజినెస్ పార్ట్నర్ని. సామంత్ పేరు చెప్పాను గాబట్టి ఇంకే వివరాలూ అక్కర్లేదనుకుంటాను.

ప్రస్తుతం సామంత్ పరిస్థితి ఏమాత్రం బాగా లేదు. డాక్టర్లు అతను బతికే అవకాశం లేదని చెప్పేశారు. రెండు కిడ్నీలూ చెడిపోయాయి. లంగ్స్ కూడా దెబ్బ తిన్నాయి. బతుకుమీది విరక్తితో వాడింతదాకా తెచ్చుకున్నాడు. ఆ విరక్తికి గల కారణమేమిటో వాడెప్పుడూ చెప్పలేదు. వాడొద్దనుకున్న గతాన్ని కెలకడం ఇష్టంలేక నేనూ ఎప్పుడూ అడగలేదు.

ఇప్పుడు...

పూంఛ్‌లోని ఒక చిన్న క్లినిక్‌లో ఇన్‌పేషంటుగా రోజులు లెక్క పెట్టుకుంటూ జాగృతీ, సుషుప్తీ కాని స్థితిలో వున్నాడు. అందువలన వాడి గతాన్ని శోధించక తప్పలేదు. డైరీలో మీ అడ్రస్ దొరికింది. మీదొక్కటే వుంది. మీ ఇద్దరికీ గల బంధుత్వం ఏమిటో నాకు తెలీదు. అలాటిదేదైనా వుంటే తక్షణం బయల్దేరి రాగలరు, ఆఖరి చూపుల కోసం.

వాసంతికి నా కేరాఫ్‌లో వచ్చిన భాస్కర్ వుత్తరాన్ని ముందు నేనే విప్పి చదివాను. ఎవరీ సామంత్. అతని డైరీలో వాసంతి అడ్రస్ ఎందుకుంది? అదొక్కటే ఎందుకుంది? నాలో వుత్కంఠ.

ఉత్తరాన్ని వాసంతికిచ్చాను. చదవడం పూర్తి చేసేసరికి ఆమె కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి.

“ఎవరతను?” అసహనంగా అడిగాను.

“మా బావ,” రుద్ధస్వరంతో అంది.

ఇంకేం? నాకు భగ్గుమంది.

“అతనికెవరూ లేరా?”

‘‘మా నాన్న చెల్లెలి కొడుకు. అత్తయ్యా, మామయ్యా చిన్నప్పుడే చనిపోతే మా ఇంట్లోనే వుండి చదువుకున్నాడు. తర్వాత ఇంట్లోంచి వెళ్లిపోయి ఆర్మీలో చేరాడు. ఐదేళ్లు చేశాక అది వదిలేసి కాశ్మీర్‌లోనే బిజినెస్ పెట్టుకుని సెటిలైపోయాడు”.

“ఎప్పుడూ అతని గురించి నాతో అనలేదేం?”

“ప్రత్యేకంగా చెప్పటానికేం లేదుగా.”

ఏదో వుంది. అందుకే ఈ దాపరికం. వుక్రోషంగా అనుకున్నాను.

“వెళ్లాలా?” అనడిగాను.

అక్కర్లేదని నేనే అనేస్తే సరిపోతుంది. వాసంతి కింకా తల్లిదండ్రులున్నారు. వాళ్లకి తెలియపర్చినా చాలు. కానీ వాసంతిని శోధించాలని నా కోరిక.

''వెళ్లొద్దాం,'' వాసంతి బేలగా అంది.

ఫలితమే ఈ ప్రయాణం.

*

నేను దారంతా మౌనంగానే వున్నాను. జమ్మూ నించి బస్సు ప్రయాణం. ఘాట్‌రోడ్లు. మైమరపించే ప్రకృతి. కానీ నా మనసందులో లీనం కాలేదు.

బస్సు దిగగానే వెతుక్కుంటూ ఎదురొచ్చిన వ్యక్తిని భాస్కర్‌గా గుర్తించడానికి మేం పెద్దగా ప్రయాస పడక్కర్లేకపోయింది.

''ఎలా వుంది సామంత్‌కి?'' దుఃఖంతో భారంగా వున్న గొంతుతో అడిగింది వాసంతి.

''చూద్దురుగాని.''

మా సామాన్లు అందుకుని ముందుకి దారి తీశాడతను. మమ్మల్ని తనింటికి రమ్మనలేదు. డైరెక్టుగా హాస్పిటల్‌కి తీసికెళ్లిపోయాడు.

సినిమాల్లో లంగ్ కేన్సర్ పేషెంట్లనీ, డ్రంకర్డ్సనీ చాలా గ్లామరైజ్ చేసి చూపిస్తారు. ట్రయాంగిల్ లవ్ సీన్స్‌లో ఆడవాళ్ల ఏడుపుని కూడా.

అదే దృష్టితో... అంటే నేనెప్పుడూ చూసెరగని ఈ సామంత్‌ని దేవానంద్ గ్లామర్తో వూహించుకున్నానేమో షాకైపోయాను.

అస్థిపంజరానికి చర్మం కప్పినట్టు మంచానికి అతుక్కుపోయి వున్నాడు. ఒకప్పుడెలా వుండేవాడో వూహించటానికి కూడా వీల్లేనంతగా రోగచ్ఛాయలు న్నాయి. చర్మం బాగా కృశించి పోయింది.

ఎన్ని పాతజ్ఞాపకాలు మదిలో మెదిలాయో ఒక్కంగలో వెళ్లి అతని మంచం మీద కూర్చుంది వాసంతి.

''సామంత్,'' ఆర్తిగా పిలుస్తూ అతని చేతిని తన చేతిలోకి తీసుకుని దుఃఖం నిగ్రహించుకోవడానికి ప్రయత్నిస్తోంది.

ఆపైన....కళ్లు తెరుస్తాడు. వాసంతిని చూస్తాడు. 'ఇలాగైపోయావేమిటి,' అని అడుగుతుంది. 'నీకోసమే,' అంటాడు.

ఆ తర్వాత?

వూహించటం నాకు సాధ్యపడలేదు. అక్కడే వుండి సినిమా సీనులా అదంతా చూడటమూ నాకు సాధ్యపడదు. బయటికి నడిచాను. వచ్చేస్తుంటే టేబుల్ మీద నీలరంగు అట్టగల పుస్తకం కనిపించింది. తీసుకుని వచ్చేశాను. అది సామంత్ డైరీ.

నా వెనకే అడుగుల చప్పుడు. అది భాస్కర్‌ది.

''సామంత్...మీకు?'' సందిగ్ధంగా ఆపేశాడు.

''వాసంతి కజిన్,'' కుప్తంగా జవాబిచ్చాను.

నా మనసంతా సామంత్ డైరీ మీదే వుంది. ఏం రాశాడందులో? వాసంతిని ప్రేమించాననా? ప్రతిక్షణం ఆమెనే తలుచుకుంటూ గడిపేస్తున్నాననా? వాసంతిని ఎందుకు పెళ్లి చేసుకోలేదు? అన్నీ సందేహాలే. తొందరగా డైరీని చదివేసి సందేహ నివృత్తి చేసుకోవాలని ఆత్రంగా వుంది.

డైరీలో ఏమేం వున్నాయో అన్నీ చదివి వుంటాడీ భాస్కర్. ఐనా ఏమీ తెలీనట్టు అడుగుతున్నాడు. నటన. అందరూ నటులే. కటువుగా తలతిప్పి అతన్ని చూశాను.

''నిన్నటి నుంచీ ఇక్కడే వున్నాను. మరి నాకింక సెలవిప్పిస్తే వెళ్తాను,'' అన్నాడు. అని క్షణం ఆగి, ''మా ఇంట్లో మీకు కంఫర్టబుల్‌గా ఉండదు. ఈ దగ్గర్లో లాడ్జి వుండి. చాలా బావుంటుంది,'' గొణిగినట్టని మళ్లీ నా మొహంలోకి చూడకుండా తలదించుకుని వెళ్లిపోయాడు.

సామంత్‌కి అతనెలాంటి మిత్రుడో అర్థమైంది. మనసు అతని మీది నుంచి డైవర్ట్ చేసుకుని డైరీ తెరిచాను. ఎర్రటి స్కెచ్‌పెన్‌తో వాసంతి అడ్రస్ మొదటి పేజీలో రాసి వుంది. ఆ తర్వాతన్నీ ఏవో లెక్కలున్నాయి. ఒక పద్దు పుస్తకంలా వుంది. నాకు నిరుత్సాహం కలిగి మూసేశాను. ఆ ఎర్రటి అక్షరాలు నా మనోనేత్రం ముందునించి చెరిగిపోవటంలేదు.

నేను తిరిగి హాస్పటల్ కొచ్చేసరికి సామంత్ మెలకువగానే ఉన్నాడు. అతని బెడ్‌కి దగ్గరగా స్టూల్‌లాక్కుని కూర్చుంది వాసంతి. చిన్నగా మాట్లాడుతోంది. నేను వాళ్ల మధ్యకి వెళ్లకుండా బైట కారిడార్లో నిలబడ్డాను. మాటలు వినిపిస్తున్నాయి.

''ఏంటిదంతా సామంత్?'' అడుగుతోంది వాసంతి. ఆమె గొంతు భారంగా వుంది. అప్పుడే వాళ్ల సంభాషణ మొదలైనట్టుంది.

ఇంతసేపూ ఏం చేసినట్టు?

ఏమీ పట్టనట్టు నేనూ, మేమొచ్చామనే రిలీఫ్‌తో భాస్కర్ ఎవరిదోవన వాళ్లం వెళ్లిపోయాక వాసంతి ఒక్కర్తే డాక్టర్ దగ్గిరకెళ్లి పేషంటు కండిషనదీ తెలుసుకుందనీ, హోప్స్ లేవని డాక్టరు చెప్పాడనీ అంత దుఃఖాన్నీ మనసులో దాచుకుని అతన్తో మాట్లాడుతోందని నాకు తరువాత తెలిసింది.

"చేతనైతే నీ జోలికి రాకుండా ప్రేమించమన్నాడు మీ నాన్న. ఆ ప్రయత్నమే ఇది." సామంత్ గొంతుచాలా బలహీనంగా వున్నా, మాటల్లో స్థిరత్వం వుంది. భావ వ్యక్తీకరణలో పొందిక వుంది.

"ప్రేమంటే ఏమిటి?" వాసంతి ప్రశ్న.

"పెళ్లైనదానివి నీకు అనుభవంలోకి రాలేదా?"

"రాలేదు. నువ్వనుకుంటున్న ప్రేమ పుస్తకాల్లో వుంటుంది. సినిమాల్లో హీరో హీరోయిన్ల మధ్య వుంటుంది. నిజ జీవితంలో వుండదు."

"అప్పటికీ ఇప్పటికీ ఏమీ మారలేదు నువ్వు."

"మారకేం? చాలా మారాను. నువ్వు నన్ను ప్రేమించానని చెప్పినప్పుడు నాకు పదహారేళ్లు. నవలల్లో హీరోలూ, సినిమా హీరోలూ నామీది గెలుపుకోసం మనో వీధుల్లో స్వైరవిహారం చేసేవారు. సన్నగా రివటలా వుండే నువ్వు వాళ్లతో ఎందులోనూ పోటీపడలేక పోయావు. తర్వాత మా నాన్న సంబంధాలు చూడటం మొదలుపెట్టాడు. దాంతో కలల్లోంచీ భూమి మీదికి వచ్చేశాను."

"అప్పుడేనా నేను గుర్తురాలేదా?"

"ఏదీ నాన్నతో పోట్లాడి వెళ్లి ఆర్మీలో చేరావుగా?"

"అంతే! మర్చిపోయావా?"

"మర్చిపోతే వెతుక్కుంటూ ఇంత దూరం ఎందు కొస్తాను?"

"మీవారొచ్చారా?"

"వచ్చారు."

"ఏరీ?"

"బైటికెళ్లారు."

"నీకు లెటర్ రాసినట్టు భాస్కర్ చెప్పాడు. అతనికి కోపం వస్తుందేమోనని భయపడ్డాను."

"తను నీలా భావుకుడు కాదులే. ప్రాక్టికల్ పర్సన్."

"చాలా హేపీగా వుంది వాసంతీ, నిన్నిలా చూస్తుంటే."

"నాకు మాత్రం బాధగా వుంది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నిన్ను తీసుకెళ్లచ్చునేమో డాక్టర్ని అడుగుతాను. మాతో వద్దువుగాని. అమ్మ, అక్కయ్య లూ, మేమూ అందరిమధ్య నిన్ను వంటరితనం బాధిం చదు. కొత్త జీవితం మొదలుపెడుదువుగాని," ఈ చివరి మాటలంటున్నప్పుడు మాత్రం వాసంతి గొంతు వణి కింది.

నేను వాళ్ల దగ్గరికి వెళ్లాను. నన్నతనికి చూపిం చింది వాసంతి.

"గాడ్‌బ్లెస్ యూ," అస్పష్టంగా అన్నాడతను.

క్రమంగా అతన్లో అనీజీనెస్ మొదలైంది. ఏదో చెప్పాలని తపన పడుతున్నాడు. కానీ మాట రాలేదు. కళ్లలో నీళ్లు నిండాయి. క్రమంగా మూతలు పడ్డాయి.

నేను గబగబ వెళ్లి డాక్టర్ని పిలుచుకొచ్చాను. చాలా చిన్న డిస్పెన్సరీ అది. దానికి సామంత్ మహారాజ పోషకుడు. ఆరోగ్యం దెబ్బ తిన్నప్పట్నుంచి అక్కడే వుంటున్నాడట.

"మిలట్రీ హాస్పటల్లో చేరమని ఎడ్వైజ్ చేశాను. బట్ హీవాజ్ రిలక్టెంట్," అన్నాడు డాక్టరు నాతో వస్తూ.

సామంత్‌ని చూసి, "సారీ," చెప్పేశాడు.

వాసంతి ఖిన్నురాలైంది. వాసంతిని చూడటానికే అతని ప్రాణం ఈ కొద్దిరోజులైనా ఆగిందేమో! ఏ జన్మ రుణమో నాకిది! లేకపోతే అతన్తో నాకున్న అనుబంధం ఏమిటని? అంత దూరాన్నించీ ద్వేషిస్తూ రావటం... వచ్చీరాగానే అతని ప్రాణం పోవటం.

క్లుప్తంగా అంత్యక్రియలు కానిచ్చాం. శ్మశానం నించి వస్తుంటే ఏదో కోల్పోయిన భావన కలిగింది.

భాస్కర్ చివరిదాకా మాతో వున్నాడు. బిజినెస్ గురించి ఏవో లెక్కలు చెప్పబోయాడు. నేను వద్దన్నాను. అతను సంతోషించినట్టే వున్నాడు. శ్మశానం నుంచి వెళ్లి పోయాక మళ్లీ మమ్మల్ని కలవటానికి రాలేదు.

*

తిరుగు ప్రయాణంలో, 'ఓ మనిషి చావుకి నేను బాధ్యురాలిననుకుంటే నిజంగా నేనో హత్య చేసినట్టే గదా," అంది వాసంతి.

"అంతేగాని నువ్వతన్ని ప్రేమించలేదా?" సూటి గా అడిగాను.

"ప్రేమంటే?" ఎదురడిగింది.

నిజమే. ప్రేమంటే ఏమిటి?

ఒక వ్యక్తి మనకే సొంతం కావాలనుకోవటమా?

ఆ వ్యక్తితోటే శృంగారం జరపాలనుకోవటమా?

ఇంట్లోంచి లేచిపోయి, సమాజంలోనే వుంటూ ఒక ఆడ, మగ పిల్లల్ని కని, జీవన వ్యాపారంలో కృంగి, కృశించి, చిట్టచివరికి అస్తిత్వాన్ని కోల్పోవటమేనా ప్రేమంటే?

నాకీ ఆలోచన్లే నచ్చలేదు. ప్రేమనేది ఇంత సంకు చితంగా వుంటుందనిపించలేదు.

"ఈ ప్రశ్నకి జవాబు నాకెప్పుడూ దొరకలేదు. ప్రేమనేది మైదానాల్లోకి లేచెళ్లడంలోనూ, లేవదీసుకుని వెళ్లిన అమీర్లకి అమ్మాయిల్ని సమకూర్చడంలోనూ

వుంటుందనుకోను. దేవదాసు సినిమా నాలుగైదుసార్లు చూశాను. నాకనిపించిందొక్కటే పార్వతికి ముసలి మొగుడు దొరికాడు గాబట్టి దేవదాసును మర్చిపోలేక పోయిందిగానీ అతన్ని మించిన భావుకత వున్న యువకుడు భర్తయి వుంటే?''

వాసంతి భావాలకి నేను ఉక్కిరిబిక్కిరైపోయాను. ఇలా కూడా ఆలోచిస్తారా? అని విస్మయం కలిగింది.

''సామంత్ నన్ను ప్రేమించాననప్పుడు నాకు పదహారేళ్లు. ఇంటర్ సెకండియర్లో వున్నాను. ఎమ్సెట్కి ప్రిపేరౌతున్నాను. నాకతన్లో ప్రేమాస్పదమైన అంశమేదీ కనిపించలేదు. నాకతని ప్రేమ టెక్నికలర్లోనూ కని పించలేదు. అందుకని స్పష్టంగా తిరస్కరించాను. ఈ సంగతి ఆ తర్వాత మా నాన్నకు తెలిసి అతన్ని కోప్పడ్డారు.

''నా పెద్దల్లుడు ఇంజనీరు. రెండో అల్లుడు డాక్టరు. వాసంతి కూడా పెద్ద చదువులు చదువుతా నంది. వీళ్ల పక్కని నిలబడే అర్హత నీకుందా?'' అని.

''ఊహ తెలిసినప్పట్నుంచీ వాసంతి నా భార్యనే అనుకుంటున్నాను,'' అన్నాడు సామంత్.

''చదువుకుని పైకి రావాల్సిన వయసులో ఇలాటి ఆలోచనలు చేస్తున్నావంటే నువ్వు బాగుపడవు,'' అని నాన్న కోప్పడ్డారు.

''సామంత్ మా ఇంట్లోంచి వెళ్లిపోయి ఆర్మీలో చేరాడు. మా నాన్నకి అతనెక్కడున్నదీ తెలుసేమో నాకు తెలీదు. తర్వాత అతని విషయం మేము పట్టించు కోలేదు,'' సుదీర్ఘమైన కథని క్లుప్తమైన మాటల్లో చెప్పింది వాసంతి.

నేను కన్విన్స్ కాలేకపోయాను. ప్రేమించిన నేరానికి బలైపోయిన సామంత్ రూపం కళ్ల ముందు కదిలింది. తననితాను తాగుడుతో హింసించుకునే స్థాయికి మనిషి దిగజారాడంటే దుఃఖం, విరహం అనే ఎన్ని జారుడు మెట్లు జారాడో! నాకతని మీద జాలి కలిగింది.

''మరి నా మీదేనా నీకు ప్రేమ వుందా?'' లేదని తను సామంత్తో చెప్పటం గుర్తొచ్చి వ్యంగ్యంగా అడిగాను.

''మీతో సహచర్యం ప్రేమ పుట్టిస్తోంది.''

ఆ జవాబెందుకో టఫ్గా అనిపించింది. నేను తనని శోధిస్తున్నది చాలా ఆడ్టైమ్లో అనే విషయం మాత్రం తట్టలేదు. ఒక పునశ్చరణ, దాన్నించి కొంత సంఘర్షణ ఆమెని నలిబిలి చేస్తున్నాయని గుర్తించలేదు.

''మరేం చూసి నన్ను పెళ్లి చేసుకున్నావు?'' సూటిగా అడిగాను. తనూ సూటిగానే చూసి జవాబేమీ చెప్పకుండా మళ్లీ తల వాల్చుకుని కూర్చుంది.

నోటితో చెప్పని జవాబు తన చూపుల్లోనే నాకు దొరికింది. నా అందం, చదువు, ఆస్తి, అంతస్థు చూసి చేసుకుంది. చేసుకున్నాక భర్తని గాబట్టి ప్రేమిస్తోంది. అంతేగానీ ఆమెలో సహజమైన ప్రేమనేది లేదు నాపట్ల.

పూర్ సామంత్ అనుకున్నాను ముందు. పూర్ మీ! అనుకోవాలిప్పుడు.

నా అహం దారుణంగా దెబ్బతింది. ఒక స్త్రీ తనని ప్రేమించలేదంటే ఏ మగవాడూ భరించలేడేమో. ప్రేమంటే ఏమిటో తెలియని వాసంతిపట్ల ప్రతీకారంతో నా మనసు రగిలిపోయింది.

రైలాగింది. కిటికీలోంచి స్టేషన్ పేరు చూశాను. వాసంతీ వాళ్ల వూరికి వెళ్లాలంటే దగ్గరి రైల్వేస్టేషన్ ఇదే. తటాలున మెరుపులా ఒక ఆలోచన మెదిలింది.

''టీ తాగొద్దాం పద,'' అన్నాను లేస్తూ.

ఇద్దరం దిగాం. స్టాల్ దగ్గర టీ తాగాం. నేను కావా లనే డబ్బులివ్వటం దగ్గర జాప్యం చేశాను. రైలు కూత కూసింది.

''కదుల్తుందేమో,'' అంది వాసంతి కంగారుగా.

ఆమె కంగారుని పట్టించుకోకుండా తాపీగా షర్టు జేబులోంచి ఒక టికెట్టు తీసి చేతిలో పెట్టాను. ''నిన్ను ప్రేమించిన సామంత్ పట్ల నీకు కొంచెమైనా కమిట్ మెంట్లేదు. పెళ్లి చేసుకున్న నామీద కూడా నీకు ప్రేమ లేదు. నువ్వొక వాసన లేని పువ్వువి. ఐ హేట్ యూ. హేట్ యూ బై ఆల్ మీన్స్,'' కసిగా అని గబగబ వెళ్లి కదుల్తున్న రైలెక్కేశాను.

నిశ్చేష్టురాలై ఆమె అలాగే నిలబడి చూస్తున్న దృశ్యం క్రమంగా ఫేడౌట్ అయిపోయింది.

*

వెంటనే బయల్దేరి రమ్మని నాకు నాన్న దగ్గి ర్నుంచి అల్టిమేటం వచ్చింది.

వెళ్లాలనిపించలేదు. వెళ్లకపోయినంత మాత్రాన నేనూ వాసంతీ గొడవపడిన విషయం సమసిపోదు. దాన్ని ఏదో ఒకలా సెటిల్ చేసుకుంటేగానీ నాలో రగిలే అగ్నిభాండం చల్లారదు. అందుకే అయిష్టంగా వెళ్లాను.

ఎవరూ నన్నా విషయం ప్రశ్నించలేదు. మామూలు కుశల సమాచారాలు అడిగారు.

వాసంతి గురించి వాళ్లెవరూ అడగకపోవటంతోనే గ్రహించాను విషయం తెలిసిందని.

ఒకటి, రెండు రోజులు గడిచాయి. నా అంతట నేనే చెప్తానని వాళ్లూ, రమ్మని పిలిచి అడగకుండా వూరుకుంటే నా అంత నేనెందుకు చెప్పాలని నేనూ.

మూడోరోజున రెండో వదిన గదిలోకి వచ్చి కూర్చుంది. తను నా క్లాస్‌మేట్. అన్నయ్య తనని ప్రేమించి చేసుకున్నాడు. ఏడేళ్లపాటు ఆమె కోసం నిరీక్షించాడు. అంత నిరీక్షణ తర్వాత అమె కాదని వుంటే వాడేమైపోయేవాడోనని అప్పుడప్పుడు అనుకుంటుంటాను. ఇప్పుడు మాత్రం సామంత్ గుర్తొచ్చి అతన్లా అన్నయ్య మారే పరిస్థితి నుంచి వాడిని కాపాడినందుకు వదిన పట్ల ఎంతో కృతజ్ఞత కలిగింది.

"చెప్పు పరిమళా," అన్నాను. నా కృతజ్ఞతనంతా గొంతులోనే తొణికిస్తూ.

"నువ్వే చెప్పాలి," అంది.

తను నేనేం చెప్పాలని ఆశిస్తోందో వూహించాను. ఎవరో ఒకరికి చెప్పుకుంటేగానీ మనోభారం తగ్గదని నాకూ తెలుసు. కానీ ఎలా చెప్పాలో బోధపడలేదు. అదంత తేలిగ్గా చెప్పగలిగే విషయంలా నాకనిపించలేదు.

"వాసంతీ వాళ్ల పెద్దన్నయ్య ఫోన్ చేసి చెప్పాడు విషయం," అని రియాక్షన్ కోసం నా ముఖంలోకి చూసింది. "భార్యభర్తల మధ్య గొడవలు రాకుండా వుండవు చెందూ! కానీ నడిస్టేషన్లో టీ తాగుదామని దింపి టికెట్ చేతిలో పెట్టి నీదారి నీదని చెప్పి వచ్చేశావంటే గొడవ చాలా తీవ్రమైనదేనని ఇంట్లో అందరం అనుకుంటున్నాం."

నేను మాట్లాడలేదు.

"మా తోడికోడళ్లు ముగ్గుర్లోకీ వాసంతి చాలా తెలివైనదని అనుకుంటుంటాను నేను. ఎందుకంటే చక్కటి పెంపకంలో పెరిగి, పెద్ద కుటుంబంలోంచి వచ్చిందీ, చదువుకున్నదీ గాబట్టి, కానీ ఇలా జరిగిందేమిటి?"

"అవన్నీ పైపై హంగులు. వాస్తవానికి ఆ అమ్మాయికి స్వార్థమే తప్ప ప్రేమించడం రాదు. పరిమళా! డూ యూ బిలీవ్? తన స్వార్థానికి ఒక మనిషి బలైపోయాడు. లిటరల్లీ షి కిల్డ్ హిమ్," ఆవేశంగా అన్నాను.

"ఏం జరిగిందసలు!"

మొత్తం అంతా చెప్పాను. "వాసనలేని పువ్వని తెలిసీ నా గుండెల్లో ఎలా దాచుకోను," అడిగాను.

"ప్రేమించడానికో అర్హత వుంటుంది తెలుసా? వాసంతిని అతను ప్రేమించి వుండచ్చు. కానీ ఆమెకతని పట్ల ప్రేమ వుండాలనేముంది?" అంది వదిన.

"అదెందుకంటే సామంత్‌కి చదువూ, ఉద్యోగం, ఆస్తి, అంతస్థూ లేవు. అందుకని వాసంతి అతన్ని ప్రేమించలేకపోయింది. అవన్నీ నాకున్నాయి గాబట్టి నన్ను పెళ్లి చేసుకుంది," వెంటనే జవాబిచ్చాను.

"అందులో తప్పేముంది?"

"తప్పేం లేదా?"

"పదిమంది అమ్మాయిల ఫోటోలు తెచ్చి నీ ముందు పెట్టాం. అందులో నాలుగింటిని కట్నకానుకలు సరిగ్గా ఇవ్వలేరని పక్కన పెట్టాం. మరో ఇద్దరమ్మాయిలు నీకు నచ్చలేదు. మిగిలిన నలుగుర్నీ పెళ్లిచూపుల్లో చూసి వాసంతిని ఎన్నుకున్నావు. అలాగే వాసంతి కూడా బెటర్ ఛాయిస్‌ని ప్రిఫర్ చేయటంలో తప్పు లేదుగా? వాసంతి కజిన్ మాత్రం? ఆమెనే ఎందుకు ప్రేమించాలి? వాళ్లింట్లో పనమ్మాయినో, తనలాంటి మరో దిక్కులేని అమ్మాయినో ఎందుకు ప్రేమించలేదు? అతనూ బెటర్ ఛాయిసే చూసుకున్నాడు కదా!"

"ప్రేమ అవన్నీ చూడదు. ఎవరిమీద ఎప్పుడు ఎందుకు పుడ్తుందో ఎవరూ చెప్పలేరు. ఇట్ జస్ట్ హేపెన్స్."

"అది కాంట్రాస్ట్‌లో వాసంతికి వర్తించదా?"

"నువ్వు మాటల్తో మెలికలేస్తున్నావు పరిమళా," అన్నాను విసుగ్గా. రీజనింగ్ తర్కానికి అందదు. కొన్ని కొన్ని విషయాల్లో తర్కించి నోరు మూయించవచ్చుగానీ మనసుకి సమాధానం చెప్పలేం.

"ఫాక్ట్స్ వప్పుకోవలసి వస్తే అలాగే వుంటుంది మరి! స్త్రీ కోసం... కేవలం ఒక్క స్త్రీ కోసం యుద్ధాలు చేసుకుని ప్రాణాలూ, రాజ్యాలూ పోగొట్టుకున్న సంస్కృతి మనది. నేను నిన్ను ప్రేమించాను. నాకోసం నువ్వేం చేస్తావని అడిగి మరీ ఆ స్త్రీని బురదలోకి లాగి, త్యాగశీలవమ్మా మహిళా అని పాడుకుని సంతోషించే కల్చర్ మనది..."

"ఎందుకీ సెటైర్లు?" కూల్‌గా అడిగాను. తనకీ ఓ గతం వుంది. అనుభవం వుంది. అవి యిలా మాట్లాడిస్తున్నాయని గ్రహించలేదు.

"సెటైర్లు కాదు. ప్రాణప్రదంగా ప్రేమించాననుకుంటూనే తనకోసం ప్రాణాలన్నీ కళ్లలో నిలుపుకుని ఎదురుచూసిన సీత చేత అగ్ని ప్రవేశం చేయించిన రాముణ్ణీ-

"మరొకరికి అవకాశం ఇవ్వకుండా మత్స్యయంత్రాన్ని ఛేదించి అర్జునుడు చేపట్టిన ద్రౌపదిని

పాంచాలిని చేసి, అదీచాలక తన స్వంత చెల్లెలినే ఆమెకి సవతిని చేసిన కృష్ణుణ్ణి కొలిచే సాంప్రదాయం మనది.

''త్యాగాలన్నీ స్త్రీలుచేస్తే వాటితో విజయాలని సాధించి గొప్పగా ప్రపంచానికి చాటుకునే చరిత్ర మనది. ఆడవాళ్లకీ వ్యక్తిత్వం వుంటుందని గుర్తించ డానికి మనకి మనసొప్పదు. అంతేనా చెందూ?''

''ఫెమినిజం పుస్తకాల్లో చదవడానికి బావుం టుంది,'' అన్నాన్నేను.

''ఔనంతే. నువ్వు చెప్పేది వాస్తవం. నేను చెప్పేది హైపోథిసిస్. అంతేనా?''

''నువ్వెలా అనుకున్నా సరే, ఐ హేట్ హర్. ఆమెని నా భార్యగా వూహించుకోలేకపోతున్నాను. దట్ పూర్ క్రీచర్ సామంత్.. తల్లీ తండ్రీ చిన్నతనంలోనే పోతే ఆ ప్రేమ రాహిత్యాన్ని వాసంతిని ప్రేమించడంలో భర్తీ చేసుకుంటే... ఓ గాడ్.. ఎంత మిజరబుల్‌గా చచ్చి పోయాడో తెలుసా? ఆడవాళ్లు యింత క్రూరంగా కూడా వుంటారా? ఇదేనా పరిమళా, నువ్వు చెప్పే వ్యక్తిత్వం?''

చాలాసేపు వదిన మాట్లాడలేదు. తర్వాత నెమ్మ దిగా గొంతు విప్పింది. ''నేను ఇంటర్మీడియెట్ చదువు తున్నప్పుడు మీ అన్నయ్య రోజూ మా కాలేజి విడిచే టైముకి వచ్చి గేటు దగ్గిర నిలబడేవాడు. నన్నెంతో ఆరా ధనగా చూసి, 'ఐ లవ్యూ' అనేవాడు. అప్పుడు తనూ స్టూడెంటే. ఇదే సినిమాల్లోనైతే ఎంతో అద్భుతంగా చూపించేవారు. కానీ నాకు చాలా ఎంబరేసింగ్‌గా వుండేది. ఫ్రెండ్స్ చూస్తారేమో. లెక్చరర్స్ చూస్తారేమోనని ఏడుపొచ్చేది. అదేదో యీవ్ టీజింగనుకుని నా ఫ్రెండ్స్ కూడా నాకు దూరమయ్యారు. చాలా ఇన్సల్ట్‌గా వుండేది.''

ప్రేమకి గల మరో పార్శ్వాన్ని వదిన మాటల్లో చూడసాగాను. అన్నయ్య ద్వారా ఈ విషయాలన్నీ చాలా వరకూ విన్నవే అయినా వదిన చెప్తుంటే కొత్త అర్థాలు ధ్వనిస్తున్నాయి.

''కాలేజికి వెళ్లనని చెప్పి ఏడ్చాను. అమ్మా నాన్నా తరచి తరచి అడిగి విషయం రాబట్టుకున్నారు. మీ అన్నయ్యని యింటికి పిలిపించారు.''

తర్వాత జరిగింది కూడా నాకు తెలుసు.

''ఇప్పటికిప్పుడు మా అమ్మాయిని నీకిచ్చి పెళ్లి చేస్తాను. నీకు సమ్మతమేనా? మీ ఇంట్లో వాళ్లు ఒప్పు కుంటారా?'' అని వదినా వాళ్ల నాన్న అడిగేసరికి అన్నయ్య తెల్లమొహం వేశాడట.

''మాకున్నది ఒకే ఒక్క సంతానం. మా ఆశలన్నీ పరిమళ మీదే. తనని ఇంజనీరింగ్ చేయించాలని కోరిక. ఉన్న పళంగా మీ ఇద్దరికీ పెళ్లి చస్తే మరి మీ నాన్నగారు ఆల్రెడీ మీ అన్నదమ్ములూ అక్కచెల్లెళ్లూ ఐదుగురితోపాటు తననీ చదివిస్తారా? లేకపోతే మీరి ద్దరూ యిప్పట్లో పెళ్లిమాట మర్చిపోయి, చదువుకుని పైకొచ్చాక పెళ్లి చేసుకుంటారా? ఏదో ఒకటి నువ్వే ఆలోచించుకుని చెప్పు,'' అని ఆయన సూటిగా అనే సరికి అన్నయ్య ఓ నమస్కారం పెట్టి వచ్చేశాట్ట.

మా యింట్లో అందరం కలుసుకుని సరదాగా వున్నప్పుడు యీ విషయాలు చెప్పుకుని నవ్వుకుంటాం. ఎప్పుడూ వీటి గురించి లోతుగా ఆలోచించలేదు. ఇప్పుడే ఏదో చిన్న ఆలోచన మొదలైంది. ఇంతలోనే వదిన అంది.

''మా నాన్న మాటల్ని ఛాలెంజ్‌గా తీసుకుని మీ అన్నయ్య పీజీ దాకా చేసి సివిల్స్‌లో నెగ్గుకొచ్చి అపా యింట్‌మెంట్ ఆర్డర్తో మా యింటికొచ్చి మళ్లీ అడిగారు. అప్పటికి మేమంతా ఆ విషయాన్ని మర్చేపోయాం. ఇంకొన్నాళ్లు గడిస్తే, నా పెళ్లి కూడా జరిగేదేమో! వేరే వ్యక్తితో.''

''అంటే నువ్వు మా అన్నయ్యని ప్రేమించలేదా పరిమళా?'' విస్మయంగా అడిగాను. నాకూ వూపిరి నిలిచిపోయినట్టయింది.

''ఎందుకు ప్రేమించాలసలు? మీ అన్నయ్యననే కాదు. ఎవర్నైనా సరే ఎందుకు ప్రేమించాలి? ఆ అవ సరం ఏమిటి? తల్లిదండ్రులు తమ జీవితంలోని ఒక భాగంగా పిల్లల్ని భావిస్తారు. ఆ భాగాన్ని అందంగా తీర్చి దిద్దుకునే బాధ్యత తమదేననుకుంటారు. అందమైన బాల్యాన్ని అందించిన పేరెంట్సు యౌవనాన్ని మాత్రం అంతందంగానూ మలచరా?''

''పరిమళా!''

''ప్రేమంటే ఏమిటసలు? ఇద్దరు మనుషులు కలుసుకోవడం వలన కలిగే పాజిటివ్ ఇంటరాక్షన్. అది పెళ్లితో కూడా జరగచ్చుగా?''

''చాలా టఫ్‌గా వున్నాయి మీ భావాలు.''

''తప్పుగానూ వున్నాయా? వుంటే చెప్పు, కరెక్ట్ చేసుకుంటాను. ఆ కరెక్టు చేసుకోవడమేదో మా అమ్మాయితో మొదలుపెట్టి, రేపెవరేనా 'ఐ లవ్యూ' చెప్పగానే అమాంతం వాడితో డ్యూయెట్లు లాగిం చెయ్యమంటాను,'' అని నవ్వేసి చర్చ ఆపేసి వెళ్లిపో యింది.

నేను ఆలోచనలోపడ్డాను. వదిన చివరి మాటలు ఛర్నాకోలా అంచులా నా గుండెని తాకి మంట పుట్టిం

చాయి. అప్పటిదాకా నా కళ్లకి కట్టినట్టున్న సామంత్ రూపం ఫేడౌటై టీ స్టాల్ దగ్గర వాసంతి చేతిలో టిక్కెట్టు పెట్టేసిన దృశ్యం కదిలింది. గిల్టీగా అనిపించింది. వాసంతి ఏం చెయ్యాలని ఆశించాను? నాకే అర్థమవ లేదు?

హాల్లో ఫోన్ మోగుతోంది. ఎవరూ ఎత్తడంలేదు. నేనే వెళ్లి లిఫ్ట్ చేశాను.

వాసంతి!

"చెందూ కావాలి," అంది ఎత్తినది నేనని తెలీక.

"నేను. చెప్పు," అన్నాను ముక్తసరిగా.

"ఒక హెల్ప్ చెయ్యగలరా?"

"ఏమిటది?" నా భృకుటి ముడిపడింది. ఏమి ఆశిస్తోంది తను నా నుంచి?

"కొంచెం ఓపిగ్గా వినాలి మరి... మొదటిసారి నేను పెళ్లిచూపులకి కూర్చున్నప్పుడు అతని వూహా మాత్రం చేత నా మనసులో తటిల్లతలు మెరిశాయి. కడగంటి చూపుల్తో నయాగరాలూ, కులుమనాలీలూ గుర్తొచ్చాయి. అతనే నాక్కాబోయే భర్తనుకుని నిరభ్యం తరంగా టెక్నికల్ కలలన్నీ కన్నాను. ఈ తర్వాత... అతను తనని అమెరికా పంపగలిగే కెపాసిటీ గల సంబంధం చూసుకుని నాకు టాటా చెప్పేశాడు. అప్పుడొక నిర్ణయం తీసుకున్నాను. పెళ్లిచూపుల్లో చూసినవాడిని మదిలోకి ఆహ్వానించి మకిలి చేసుకోకూడదని. ఆ తర్వాత మీరు తటస్థపడ్డారు... నా తొలిప్రేమ ఏ అగాథా ల్లోకి జారిపోయిందో వెదికి పెట్టగలరా? పువ్వుల్లో పెట్టి సమర్పించుకుంటాను," అంది.

ఆమె మాటల్లో కొంత వాస్తవం వుంది. మరికొంత కవ్వింపు ఉంది. కానీ ఎంత కటువైన వాస్తవాన్ని చెప్పింది వాసంతి. ఆమె తొలిప్రేమ ఏ అగాథాల్లోకి జారి పోయిందో నేనెక్కడ వెతుక్కోగలను? అలా వెతికేది వుంటే ముందు నా ప్రేమని వెతుక్కోవాలి ఏ పెళ్లి చూపుల్లో పారేసుకున్నానోనని. కానీ నా ప్రశ్నకి సమాధానం...?

"కానీ నువ్వు చెప్పేది నా ప్రశ్నకి సమాధానం కాదు," అన్నాను కఠినంగా.

"ప్రశ్నేమిటసలు?"

"... ... ..."

"లవ్... యిట్ జస్ట్ హేపెన్స్, అంతే. సామంత్‌కి నామీద, నాకు మరొకరి మీద. మీకు యింకొకరి మీద రెండు కొసలూ కలవని దారంలా అలా. ఆ తొలి ప్రేమను బస్సుల్లోనే, రైళ్లలోనో, పెళ్లిచూపుల్లోనో పారేసు కుని వొట్టి మెటీరియలిస్టులుగా మిగిలిపోతున్నాం."

"... ... ..."

"అతను నా మనసు మీద కాకుండా నా జీవితం మీద పట్టుకోసం ప్రయత్నించాడు. తనకి రాని చదువు నాకూ అక్కరలేదన్నాడు. నన్ను కని పెంచిన తల్లి దండ్రుల్ని కాదని తనతో వచ్చెయ్యమన్నాడు. ఒకసారి మీ యిద్దరికీ పెళ్లంటూ జరిగితే చచ్చినట్టు మా నాన్నే దిగివస్తాడన్నాడు. కానీ నేను పావుని కావాలనుకోలేదు."

"మనిషికీ మనిషికీ మధ్య నుండేవి ఆర్థికబంధా లేనా వాసంతీ? నువ్వతన్ని తప్పుగా అర్థం చేసుకున్నా వేమో."

"మనిషికీ మనిషికీ మధ్య మొదటగా ఆర్థిక బంధాలు చోటు చేసుకుంటేనేగా అవి అనుబంధానికి దారితీసేవి? పసిపిల్లల మధ్య స్నేహం ఆటబొమ్మని పంచుకోవడంతోనో, కేడ్‌బరీ యిచ్చి పుచ్చుకోవటంతోనో ప్రారంభమౌతుంది. భార్యాభర్తలు మధ్య అనుబంధం కూడి ఇచ్చిపుచ్చుకోవడాలతోనే మొదలౌతుంది. ఏమీ యివ్వలేనివాడు కనీసం తన హృదయాన్నైనా యివ్వ గలగాలి. కానీ, అతను అన్నీ నా నుంచే ఆశించాడు."

నేను యింకేమీ మాట్లాడకుండా ఫోన్ పెట్టేశాను. అంత అర్థాంతరంగా పెట్టేసినా మళ్లీ రింగవలేదు.

నేను ఆలోచనలో పడ్డాను. వాసంతి గుండెలోతు కొలవాలనుకున్నాను. అదొక మహాబిలంగా నన్ను తన లోకి లాక్కుని అంతు తెలియని మరిన్ని అగాధాలని చూపిస్తోంది. ఈ ప్రస్థానానికి గమ్యం ఏమిటి? బిలానికి అవతలి ఒడ్డంటూ వుండదు. అంతూదరీ లేని యీ శోధన నేనెందుకు చెయ్యాలి. ఆమె ఒక స్త్రీ అందుకే సామంత్‌ని ప్రేమించకపోయినా ద్వేషించలేదు. రక్త స్పర్శకి చలించింది. ఆమె నా భార్య. నన్ను ప్రేమించక పోయినా నిబద్ధతతో వుంది. మనిషికీ మనిషికీ మధ్య నున్నవి ఆర్థిక సంబంధాలే కాబట్టి కమిట్‌మెంట్ గల లైఫ్ పార్ట్‌నర్ దొరకటమే అదృష్టమనుకోవాలి. దట్సిట్?

నా మనసులో కమ్ముకున్న మేఘాలన్నీ తొలగి పోయి, ప్రశాంతంగా మారింది. ఆ మేఘాల్లో ఒక మేఘంగా సామంత్ జ్ఞాపకం కూడా చెదిరిపోయింది.

*విపుల, సెప్టెంబర్ 2000*